క్లుప్తంగా

స్వామివారికి పంచామృతాలతో అభిషేకం

మోపిదేవి: అవనిగడ్డ మండలం తుంగలవారి పాలెం నుంచి మోపిదేవి గుడి సెంటర్ వరకు అయ్యప్ప స్వామి మాలధారులు సోమవారం పాదయాత్రగా చేరుకున్నారు. ఉదయం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పాలకావెళ్లతో తెచ్చిన పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గురుస్వామి తుర్లపాటి రామ మోహనరావు ఆధ్వర్యంలో ఏడుగురు అయ్యప్ప స్వాములు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అడపావారిపాలెంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం

అడపావారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి-2 గ్రామ సచివాలయం అడపావారిపాలెంలో రెండవ విడత జగనన్న సురక్ష శిబిరం 9వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హారిక తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ హారిక సూచించారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

పెడన: అయోధ్య శ్రీరాముని అక్షింతలను సోమవారం పట్టణంలోని 15వ వార్డులో శ్రీరామ భక్తులు పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య శ్రీరాముని అక్షింతలను హిందూ భక్త బృందం సభ్యులు స్థానికులకు పంపిణీ చేశారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

పెడన: పట్టణంలో ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం ద్వాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. అనంతరం భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మట్టి ఖర్చులు రూ.10వేలు అందజేత

పెడన: పట్టణంలోని నాలుగో వార్డు పాల కేంద్రం సభ్యుడు అబ్దుల్ కరీముల్లా చనిపోవడంతో ఆయన భార్య ఖానీ సైదాకు సోమవారం వైఎస్సార్ బీమా మట్టి ఖర్చుల నిమిత్తం సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ చేతుల మీదుగా రూ.10వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు, 4వ వార్డు కౌన్సిలర్ రోహేతున్నీసా, హుమాయూన్, కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యూం (బాబూలాల్), సచివాలయ అడ్మిన్ వి.దేవకి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన యాత్ర

బంటుమిల్లి: వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మల్లేశ్వరం, కొర్లపాడు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 17 పథకాల గురించి యాత్ర కన్వీనరు ధూళిపాళ్ల రాము గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన యాత్ర ఉద్దేశాన్ని వివరించి కేంద్ర ప్రభుత్వం ఏఏ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందో చెప్పారు. సభలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.రమేష్, ఈఓపీఆర్‌డీ సుందరీదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి సౌందర్య, బీజేపీ మండల అధ్యక్షుడు బి.ఆంజనేయులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిని బందరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. బెల్టుషాపులపై దాడులు నిర్వహించిన పోలీసులకు మండలంలోని చిన్నాపురం, భోట్లవానిపాలెం గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావటంతో చిన్నాపురంలో ఎస్ఐ పద్మ, భోట్లవానిపాలెంలో ఎస్ఐ చాణక్య దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సుపై దాడి చేసిన ఇద్దరికి రిమాండ్

చల్లపల్లి: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై దాడి చేసి బస్సు అద్దాలు పగులకొట్టిన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చల్లపల్లి ఎస్ఐ సీహెచ్ చినబాబు సోమవారం రాత్రి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం చల్లపల్లికి చెందిన ఈడే సుధాకర్, జంపాన మాధవ్ అనే వ్యక్తులు ఆదివారం రాత్రి మద్యం తాగి బైక్‌పై వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సుకు అడ్డుపడ్డారు. బైక్ పార్కింగ్ విషయమై బస్సు డ్రైవరుతో గొడవ పడ్డారు. రాయితో బస్సు అద్దాలు పగులకొట్టారు. ప్రశ్నించిన మహిళా కండక్టరును దుర్భాషలాడి రోడ్డుపై వీరంగం సృష్టించారు. ఈ ఘటనపై కండక్టర్ గొరుముచ్చు సీలిమ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించి, విధులకు ఆటంకం కలిగించిన సుధాకర్, మాధవరావులపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులిద్దరినీ మొవ్వ కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక జవ్వారుపేటలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సంక్రాంతి వేడుకను నిర్వహించటంతో స్కూల్ ఆవరణ సందడిగా మారింది. భోగిమంటలు, భోగి పండ్లు, రంగురంగుల రంగవల్లులలో గొబ్బెమ్మలు, పొంగలి, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పలు దేశభక్తి, సినీ గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు చిత్తజల్లు ప్రసన్న, షేక్ షాహీనా, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మచిలీపట్నం రామకృష్ణ స్కూల్‌లో భోగిమంట, గంగిరెద్దులాటలను తిలకిస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, విద్యార్థులు

సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీలు

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం ఈ పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పారిశ్రామికవేత్త గాజుల సాంబయ్య నాయుడు సహకారంతో ఈ నెల 11, 12, 13 తేదీలలో సంక్రాంతి సంబరాల సందర్భంగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 11న పెడన దేవాంగ కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాటల పోటీలు, 12న డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న పెడన వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో రంగవల్లులు, మెహందీ, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు మార్కెట్ యార్డ్‌లో వివిధ పోటీల విజేతలకు బహుమతీ ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. కృష్ణాజిల్లాలోని ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 92488 07494, 86882 35377, 89774 77228లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలలో విద్యార్థుల సందడి

నాగాయలంక: స్థానిక విద్యాభారతి పబ్లిక్ పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. అతిథులుగా హాజరైన స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, స్వచ్ఛ సేవా కార్యకర్త సింహాద్రి కృష్ణప్రసాద్ సంప్రదాయబద్ధంగా తొలుత భోగి మంట ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రత్నారావు పాల పొంగళ్లు నిర్వహించారు. విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి తెచ్చిన పందెం కోడిపుంజులతో సరదా పందాలు వేశారు. పట్టు పంచెల ఆహార్యంతో సందడి చేశారు. పండుగ విశిష్టతను చాటుతూ బాలలకు పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. గాలిపటాలను ఎగురవేసి కేరింతలు కొట్టారు. ఆధునిక బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. బాలికలు జానపద నృత్యాలతో అలరించారు. అద్భుతమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రత్నారావు, అకడమిక్ డైరెక్టర్ ఎ.వి.శేషుబాబు, రాధాకృష్ణమూర్తి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

కోడూరు: సంక్రాంతి సంబరాలను ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. 6,7,8 తరగతులు చదివే విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు జరిపారు. బాలురకు పతంగులు ఎగరవేసే పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం రవి వర్మ, ఉపాధ్యాయులు రాంబాబు, బాల రమేష్, సునీతాదేవి, రామాంజనేయులు, సాంబశివయ్య, నాగరాజు పర్యవేక్షించారు.

విద్యానికేతన్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

అవనిగడ్డ: స్థానిక విద్యానికేతన్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిపారు. విద్యాసంస్థల అధినేత లంకమ్మ ప్రసాద్ భోగిమంట వెలిగించి సంబరాలు ప్రారంభించారు. అనంతరం విద్యార్థినిలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.


అవనిగడ్డ భవిత కేంద్రం వద్ద భోగిమంట


అవనిగడ్డ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

భవిత కేంద్రం వద్ద ...

అవనిగడ్డ: స్థానిక భవిత కేంద్రం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు హరిదాసుతో పాటు పలు రకాల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో...

గూడూరు: మండలంలోని తుమ్మలపాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఉండి రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. గంగిరెద్దులు, హరిదాసు వేషధారణతో సంక్రాంతి శోభ ఉట్టిపడింది. బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి చిన్నారులు సందడి చేశారు. విద్యార్థులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.



నాగాయలంకలో సంప్రదాయ పంచెకట్టుతో విద్యార్థులు, కోలాటం నృత్యాలు చేస్తున్న బాలికలు


మచిలీపట్నం రామకృష్ణస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


పెడనలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన బాషా

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కనకదుర్గ ప్రతిభ

విశాఖలో జరిగిన పోటీలలో మూడు విభాగాల్లో ప్రథమస్థానం

మచిలీపట్నంటౌన్: మాస్టర్ అథ్లెటిక్స్ విభాగంలో నగరానికి చెందిన ఎం.కనకదుర్గ వరుస విజయాలతో పలు పతకాలు సాధిస్తోంది. ఈ నెల 6, 7తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 41వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో 40 ప్లస్ విభాగంలో 100 మీటర్లు, 100 మీటర్ల హర్డిల్స్ రన్నింగ్, జావలిన్ త్రో పోటీల్లో కనకదుర్గ ప్రథమస్థానాలను కైవసం చేసుకుంది. ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటోంది. ఆ పోటీల్లో విజయం సాధిస్తే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతుంది. ఈ సందర్భంగా కనకదుర్గను నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు, ప్రముఖులు అభినందించారు.


అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి మెడల్, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కనకదుర్గ

ప్రభుత్వ సహకారం ఉంటే మరిన్ని పతకాలు సాధిస్తా



నాకు చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండేది. కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించే దాన్ని. కబడ్డీ నేషనల్స్‌కు ఆడాను. ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నా భర్త షేక్ సత్తార్ ప్రోత్సాహంతో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతి ఏడాదీ పాల్గొని బహుమతులు, మెడల్స్ సాధిస్తున్నాను. ప్రభుత్వ సహకారం ఉంటే మరిన్ని పతకాలు సాధిస్తాను.

– కనకదుర్గ, మాస్టర్ అథ్లెట్

క్రీడాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత

బంటుమిల్లి: గ్రామ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎంపీపీ వి.చినబాబు అన్నారు. మండల పరిధిలోని మల్లపరాజుగూడెం సచివాలయ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ సోమవారం బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు తన తండ్రి ఏసుపాదం జ్ఞాపకార్థం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.రాజబాబు, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, సర్పంచ్ డి.అవతారం, గ్రామ ప్రముఖులు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్‌కు సత్కారం

మచిలీపట్నంటౌన్: క్రైస్తవుల సంక్షేమానికి చాట్రగడ్డ ప్రసాద్ ఎంతగానో కృషి చేస్తున్నారని దళిత జేఏసీ జిల్లా నాయకులు పేర్కొన్నారు. సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్‌గా నియమితులైన చాట్రగడ్డ ప్రసాద్‌ను సోమవారం దళిత జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) మాట్లాడుతూ ఉత్తర సర్కారు ఏడు జిల్లాల సీబీసీఎన్‌సీ సంఘాల మహాసభల్లో చైర్మన్‌గా ప్రసాద్‌ను ఎన్నుకున్నారన్నారు. ప్రసాద్ క్రైస్తవుల సంక్షేమానికి చాట్రగడ్డ ప్రసాద్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. చాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీకి ఉన్న వేల కోట్ల ఆస్తులను పరిరక్షించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు గండ్రపు శీనయ్య మాస్టారు, వంపుగడవల చొదరి, చాట్రగడ్డ ఆల్బర్ట్, దగాని సుబ్బారావు, గొట్రు దాసు, మద్దుల పాండురంగారావు, తప్పిట రాజు, అరిగెల సురేష్, వీరాబత్తిన నాగేంద్రం, శ్రీరాములు, ఎలికే చైతన్య తదితరులు పాల్గొన్నారు.


చాట్రగడ్డ ప్రసాద్‌ను సన్మానిస్తున్న దళిత జేఏసీ నాయకులు

ఆదర్శనీయుడు అంబేడ్కర్

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు అన్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో నగరంలోని 11వ డివిజన్ సచివాలయంలో సోమవారం ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని దీనిలో భాగంగానే స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేసి దేశానికే తలమానికంగా ఉండేలా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈనెల 19న జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గూడవల్లి నాగరాజు

పైడమ్మ జాతర ఉత్సవాల ఆదాయం రూ.10.24 లక్షలు

పెడన: పట్టణంలో ఉన్న శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు 11 రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల అనంతరం పైడమ్మ హుండీతో పాటు వివిధ రకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోమవారం లెక్కించగా రూ.10,24,773 వచ్చినట్లు ఆలయ ఈవో టీవీవీ మోహనరావు తెలిపారు. రూ.10 టికెట్ దర్శనం ద్వారా రూ.1,90,420, రూ.25 టికెట్ దర్శనం ద్వారా రూ.1,28,775, విరాళాల ద్వారా రూ.3,03,907, హుండీ ద్వారా రూ.4,01,671 వచ్చాయని, మొత్తం వెరసి రూ.10,24,775 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ధర్మకర్తలు తోట సాంబశివరావు, శిరివెళ్ల వెంకట సూర్యనారాయణ, భగవాన్, నాగమణి, కోమలి, ఆసాది దాసు లీలాప్రకాష్, వార్డు కౌన్సిలర్ పద్మావతి, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: విద్యుత్ స్తంభాల కింద ఉన్న చెట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న ప్రాంతాల్లో చెట్ల ట్రిమ్మింగ్ చేపట్టినట్లు విద్యుత్ శాఖ చల్లపల్లి ఏఈఈ కన్నంరెడ్డి అరవింద్ కుమార్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీ పరిధిలో చెట్ల ట్రిమ్మింగ్ చేపట్టినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం చేపట్టిన ఈ పనులకు ఆయా ప్రాంతాల నివాసితులు సహకరించాలని కోరారు.

రబీ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించండి

పెడన: రబీ సాగులో వేసిన పంటను ప్రతి రైతు ఈ క్రాప్‌లో నమోదు చేయించాలని పెడన మండల ఏవో జీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన మండలంలోని పెనుమల్లి రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిధిలో మినుము పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రబీలో కూడా ఈ క్రాప్ చేయించుకోవాల్సిందేనని, అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. పంట రుణాలు, నష్టపరిహారం, సున్నా వడ్డీ, సబ్సిడీపై యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులు వంటి వాటిని అందుకోవడానికి ఈ క్రాప్ నమోదే ప్రామాణికమన్నారు. రైతులు తప్పనిసరిగా తమ పంటలను సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్‌లో నమోదు చేయించాలని సూచించారు. రైతు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నంబరు, ఏ రకం విత్తనం పంటను వేసిందనే వివరాలను ఆర్‌బీకేలోని వీఏఏలకు, వీఆర్వోలకు తెలియజేసి ఈ క్రాప్ చేయించాలని తెలిపారు. ఏవోతో పాటు వీఏఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.


రబీ పంటల ఈ క్రాప్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు తదితరులు

రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

గూడూరు: మండలంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. సచివాలయ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో జరిగే మండల స్థాయి పోటీలలో తలపడనున్నట్లు ఆయన చెప్పారు.

రేపు కోడూరులో కేంద్రమంత్రి యశోనాయక్ పర్యటన

కోడూరు: కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ బుధవారం కోడూరు మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. కోడూరు టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో యశోనాయక్ పాల్గొంటారన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొవాలని ఎంపీడీఓ ఆదేశించారు.

పామాయిల్ సాగుతో ఆదాయం

కోసూరు(మొవ్వ): పామాయిల్ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని కృష్ణా జిల్లా ఉద్యాన శాఖాధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని కోసూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ నూనె గింజలు..ఆయిల్ పామ్ మిషన్ పథకం ద్వారా ఆయిల్ పామ్ సాగును మేకా బాలకృష్ణకు చెందిన అయిదున్నర ఎకరాల పొలంలో సోమవారం శ్రీకారం చుట్టారు. భూమి పూజ చేసి 57 మొక్కలను నాటారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ పామాయిల్ సాగు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ కాలం దిగుబడులు పొందవచ్చునని సూచించారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి

పేర్ని కిట్టు


టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మహిళలు చేతివృత్తుల ద్వారా స్వయం ఉపాధితో స్వయం స్వావలంబన సాధించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. స్థానిక ఈడేపల్లిలోని కృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీలో సోమవారం ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని పేర్ని కిట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవనం సజావుగా సాగేందుకు భర్త సంపాదనతో పాటు భార్య కూడా చేతివృత్తులు నేర్చుకుని సంపాదిస్తే చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. తద్వారా కుటుంబం ఆనందంగా గడిపేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు పలు కోర్సుల్లో ఇస్తున్న శిక్షణను మహిళలు నేర్చుకుని ఆయా వ్యాపారాలు ప్రారంభిస్తే ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. మహిళలు చేతివృత్తులు, ఇతర వ్యాపారాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గౌర శ్రీహరి, కేశన నాని పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న డాక్టర్ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో పలు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ గోపీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్స్, బ్యూటీపార్లర్, కంప్యూటర్ ట్యాలీ, జ్యూట్ బ్యాగ్స్, టైలరింగ్ కోర్సుల్లో తమ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, స్పోకెన్ ఇంగ్లిషు నేర్పుతామన్నారు. శిక్షణ అనంతరం వ్యాపారాలు ప్రారంభించే వారికి యూనియన్ బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వారు తమ దరఖాస్తులకు రేషన్‌కార్డు, ఆధార్, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు జత చేసి అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 80089 96818 నంబరును సంప్రదించాలన్నారు.

పొక్లెయినర్ సీజ్

కోనేరుసెంటర్: అక్రమంగా జరుగుతున్న చేపలచెరువు తవ్వకాన్ని రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. తవ్వకాలు జరుపుతున్న పొక్లయినర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బందరు మండలం కానూరు గ్రామంలో ఓ రైతు ఎటువంటి అనుమతులు లేకుండా చేపలచెరువు తవ్వడమే కాకుండా మడ చెట్లు నరికిస్తున్నాడు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని తవ్వకం పనులను అడ్డుకున్నారు. తహసీల్దార్ శ్రీవిద్య ఆదేశాల మేరకు పొక్లయినర్‌ను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ యాకూబ్, కానూరు వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

సజినికి ఎంఫిల్ ప్రదానం



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని రసాయనశాస్త్ర విభాగంలో పూర్తి సమయం పరిశోధన విద్యార్థినిగా పనిచేస్తున్న కలకొండ సజిని సూక్ష్మ రసాయనశాస్త్రంలో చేసిన పరిశోధనకు గానూ సోమవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి ఎంఫిల్ పట్టాను ప్రదానం చేశారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి పర్యవేక్షణలో సజిని ఈ పరిశోధన చేశారు. ఎంఫిల్ పట్టాను పొందిన సజినిని వీసీతో పాటు రామశేఖరరెడ్డి, రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వైకే సుందరకృష్ణ అభినందించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి అవనిగడ్డకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకూ ఈ సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.